# కేబినెట్ స్థానానికి బదులు చైర్మన్ హోదా

**రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్‌గా మంచిర్యాల ఎమ్మెల్యే పీఎస్సార్**

**శెనార్తి మీడియా , మంచిర్యాల:**

రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్‌గా మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు (పీఎస్సార్) నియామకం కాంగ్రెస్ లోపలి శక్తి సమీకరణాల ప్రతిబింబంగా కనిపిస్తోంది. కేబినెట్ హోదా కలిగిన ఈ పదవి ఆయనకు ఇవ్వడం ద్వారా పార్టీ ఒకవైపు అనుభవజ్ఞుడైన నేతను గౌరవించగా, మరోవైపు మంత్రివర్గ విస్తరణలో చోటు ఇవ్వలేకపోయిన అసంతృప్తిని కొంతవరకు సమతుల్యం చేయాలనే ప్రయత్నం చేసింది. ప్రేమ్‌సాగర్‌రావు పక్కా కాంగ్రెస్ వాది. రెండు దశాబ్దాలుగా పార్టీకి కట్టుబడి, పదవుల కోసం పార్టీని వదిలిపెట్టని అరుదైన నేతల్లో ఆయనే ఒకరు. పీసీసీ, టీటీడీ, డీసీసీబీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేగా వివిధ దశల్లో ఆయనకు అనుభవం ఉంది. పార్టీ పట్ల ఆయన నిబద్ధతను ఎవరూ ప్రశ్నించలేరు. కానీ, మంత్రిత్వం ఆశించిన స్థితిలో చైర్మన్ హోదా ఆయనకు 'సంతృప్తి పత్రమా' లేక 'ప్రతిఫల రహిత సర్దుబాటు'నా అన్నది ఇప్పటికీ చర్చనీయాంశం. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సీనియర్ నాయకత్వంలో ప్రేమ్‌సాగర్‌రావు బలమైన స్థానం కలిగి ఉన్నారు. చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌కు మంత్రి పదవి ఇవ్వడం, పీఎస్సార్‌ను పక్కనపెట్టడం జిల్లా కాంగ్రెస్‌లో అసంతృప్తిని రేకెత్తించింది. ఇప్పుడు చైర్మన్ హోదా ఆ అసంతృప్తిని చల్లార్చగలదా అనేది సందేహమే. ముఖ్యంగా ఆయన ప్రస్తుతం ఆరోగ్యపరమైన కారణాలతో చికిత్సలో ఉండటం, పదవి స్వీకరణపై స్పష్టత ఇవ్వకపోవడం, రాజకీయ వర్గాల్లో కొత్త ఊహాగానాలకు తావిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నియామకంతో 'అందరినీ సంతృప్తి పరచే' రాజకీయ సమీకరణానికి ప్రయత్నించినా, పీఎస్సార్ వంటి సీనియర్ నాయకుల ఆకాంక్షలను దీర్ఘకాలం నెరవేర్చకపోతే, పార్టీకి అంతర్గత అసంతృప్తి రూపంలో ప్రతిఫలం చెల్లించాల్సి రావచ్చు. ఈ నియామకం కేవలం సత్కారం మాత్రమేనా? లేక భవిష్యత్ కేబినెట్ విస్తరణకు ముందు రాజకీయ సమతుల్య చర్యనా? అన్న ప్రశ్నకు సమాధానం పీఎస్సార్ నిర్ణయమే ఇవ్వగలదు.



## ఎంపీడీవోను సస్పెండ్ చేయాలి

- టెక్నికల్ అసిస్టెంట్ భార్గవ్ మృతి ఘటనపై నేతకాని మహర్ సంఘం డిమాండ్




**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

బెల్లంపల్లి మండలం ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ దుగుట భార్గవ్ మృతికి కారణమైన ఎంపీడీవో మహేందర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని నేతకాని మహర్ హక్కుల పరిరక్షణ సంఘం నాయకులు డిమాండ్ చేశారు.బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో సంఘం అధ్యక్షుడు గోమాత శ్రీకాంత్ మాట్లాడుతూ, వర్షాల కారణంగా కొంత పనులు పూర్తికాకపోవడంతో ఎంపీడీవో భార్గవ్‌పై అన్యాయ ఆరోపణలు మోపి, మానసికంగా వేధించాడని తెలిపారు. రూ.1.72 లక్షల వాటరింగ్ బిల్లును ముందుగానే వసూలు చేసి, 20 శాతం కమీషన్ ఇవ్వాలంటూ ఒత్తిడి తెచ్చాడని ఆరోపించారు. ఆ ఒత్తిళ్ల కారణంగా భార్గవ్ అనారోగ్యానికి గురై మృతి చెందినట్లు పేర్కొన్నారు.ఎంపీడీవో అవినీతి, అక్రమాలకు పాల్పడిన చరిత్ర ఉందని, వెంటనే సస్పెండ్ చేయాలని వారు కలెక్టర్‌ను డిమాండ్ చేశారు. లేని పక్షంలో కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ముత్తె నవీన్, లింగంపల్లి భీమేష్, ఎండీ అఫ్తాబ్, కోట సునీల్, గోమాస ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## అటవీ ప్రాంతంలో ఇద్దరి అరెస్ట్

**శెనార్తి మీడియా, మంచిర్యాల :** తపాలపూర్ బీట్ అటవీ ప్రాంతంలో అక్రమంగా వేట ప్రయత్నం చేస్తున్న ఇద్దరిని అటవీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. జన్నారం మండలం తపాలపూర్‌కు చెందిన ఎదుల చంద్రయ్య, వొడ్డేపల్లి శ్రీనివాస్‌లను తపాలపూర్ ఎఫ్ ఎస్ వో నహీదా ఆధ్వర్యంలోని బృందం పట్టుకుంది. బేస్ క్యాంప్ వాచర్ల సాయంతో నిర్వహించిన సోదాలో నిందితుల వద్ద రంపం, జి ఐ వైర్ లభ్యమయ్యాయి. అనంతరం వారిని ఎఫ్ ఆర్ వో తాళ్లపెట్, ఎఫ్ ఎస్ వో సాగరిక, డి ఆర్ వో శ్సాయి, ఎఫ్బివో శ్రీకాంత్ ల సమక్షంలో ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ జన్నారం ఎదుట హాజరుపరిచారు. విచారణ అనంతరం నిందితులు ఆరు నెలలపాటు శాంతి, సత్ప్రవర్తన పాటిస్తామని హామీ ఇస్తూ ఒక్కొక్కరు రూ.50 వేల పూచీకత్తుతో సత్ప్రవర్తన బాండ్‌పై సంతకం చేశారు.

## బస్తీ దవాఖాన తనిఖీ

**శెనార్తి మీడియా, మంచిర్యాల:** మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సాయి కుంట బస్తీ దవాఖానలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిత ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ అమన్, సిబ్బందితో సమావేశమై వైద్య సేవల నాణ్యతపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బస్తీ దవాఖానల్లో వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రభుత్వ వైద్యసేవలపై ప్రజల్లో అవగాహన పెంచాలని చెప్పారు. సాధ్యమైనంత వరకు సాధారణ ప్రసవాలు చేయాలని, అవసరం లేని సిజేరియన్ శస్త్రచికిత్సలను తగ్గించాలని ఆదేశించారు. జిల్లా లో గర్భిణుల 100 శాతం నమోదు, టీకా కార్యక్రమాలు సమయానికి పూర్తవ్వాలన్నారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలలో జిల్లా ముందంజలో ఉండేలా కృషి చేయాలని సూచించారు. వృద్ధులకు పాలిటివ్ కేర్ సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని డాక్టర్ అనిత సూచించారు.

# జాతీయ ఐక్యతకు పటేల్ నిదర్శనం

- కలెక్టర్ కుమార్ దీపక్
- మంచిర్యాలలో రన్‌ఫర్‌యూనిటీ

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**




దేశ ప్రజలందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి జాతీయ సమైక్యతకు నిదర్శనంగా నిలిచిన మహనీయుడు సర్దార్ వల్లభ భాయ్ పటేల్ అని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుండి ఐబీ చౌరస్తా వరకు నిర్వహించిన "రన్ ఫర్ యూనిటీ" 2కె రన్ కార్యక్రమాన్ని కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ ఎ.భాస్కర్, ఏసీపీ ప్రకాష్, జిల్లా క్రీడా యువజన సేవల అధికారి హనుమంతరావుతో కలిసి ప్రారంభించి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కుల, మత, వర్గ, ప్రాంతీయ భేదాలు లేకుండా ప్రజలందరినీ ఐక్యం చేసిన నాయకుడు సర్దార్ పటేల్ అని చెప్పారు. దేశంలోని 530 సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసి జాతీయ సమైక్యతకు పునాది వేశారని వివరించారు. రైతు, పౌర హక్కుల పరిరక్షణకు విశేషంగా కృషి చేశారని పేర్కొన్నారు. దేశాభివృద్ధి ప్రజల ఐక్యతలోనే ఉందని, ప్రతి ఒక్కరిలో దేశభక్తి, సమైక్యత భావం పెంపొందాలని కలెక్టర్ అన్నారు. మహనీయుల ఆశయాలను యువత సమిష్టిగా ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**



జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో సకల సదుపాయాలతో నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు.శుక్రవారం ఆయన కాసిపేట మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, తెలంగాణ ఆదర్శ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, గిరిజన ఆశ్రమ పాఠశాలలను ఆకస్మికంగా పరిశీలించారు. తరగతి గదులు, వంటశాల, మధ్యాహ్న భోజనం నాణ్యత, ల్యాబ్‌లు, పరిసరాలను తనిఖీ చేసి సూచనలు ఇచ్చారు.విద్యార్థులకు పౌష్టికాహారం, శుద్ధమైన త్రాగునీరు అందించాలనీ, నిష్ణాత ఉపాధ్యాయుల ద్వారా బోధన జరగాలనీ, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన మౌలిక సదుపాయాలు, మూత్రశాలల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

## పత్తి కొనుగోలు సమర్థవంతంగా జరగాలి: కలెక్టర్

**శెనార్తి మీడియా, మంచిర్యాల :** జిల్లాలో నవంబర్ 1 నుంచి ప్రారంభమయ్యే పత్తి కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. శుక్రవారం కలెక్టర్ తాండూర్ మండలంలోని మహేశ్వరి కాటన్స్, శ్రీరామ జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ యూనిట్లను మండల తహసీల్దార్ జ్యోత్స్నతో కలిసి పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లు, సదుపాయాలు, తూకం పద్ధతులు, నిల్వ ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతు సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం సిసిఐ ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరతో పత్తి కొనుగోలు చేస్తోందని తెలిపారు. 2025–26 సీజన్‌కు సంబంధించి రైతులు "కపాస్ కిసాన్ యాప్"లో తమ వివ రాలు నమోదు చేసుకుని, పత్తి విక్రయానికి స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. పత్తిలో తేమ శాతం, నాణ్యత ప్రమాణాలు నిబంధనలకు అనుగుణంగా ఉండాలని, కొనుగోలు సమయంలో అధికారుల పర్యవేక్షణ తప్పనిసరి అని చెప్పారు. ఆధార్ నంబర్‌కు అనుసం ధానమైన బ్యాంకు ఖాతాలోనే చెల్లింపులు జరుగుతాయని, ఆధార్ కార్డులో ఫోటో ఉన్న రైతు మాత్రమే ఫోటో ధృవీకరణ చేయించాల్సి ఉంటుందని తెలిపారు. దళారులు కొనుగోలు చేసిన పత్తిని కేంద్రాలలోకి అనుమతించరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతులు నేరుగా సిసిఐ కేంద్రాలకు పత్తి విక్రయించాలన్నారు.

## వ్యాపారులకు స్థలాలు చూపించాలి

- ప్రజల సమస్యలు పట్టని ఎమ్మెల్యే వినోద్‌పై విమర్శలు

**శెనార్తి మీడియా, మంచిర్యాల :** రోడ్డు వెడల్పు పేరుతో చిన్న వ్యాపారులపై మున్సిపల్ అధికారులు దౌర్జన్యానికి పాల్పడుతున్నారని, షాపులను బలవంతంగా కూల్చడం అన్యాయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజి తెలిపారు. శుక్రవారం స్థానిక వ్యాపారులతో కలిసి బెల్లంపల్లి సబ్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏమాజి మాట్లాడుతూ.. వ్యాపారులకు ప్రత్యామ్నాయ స్థలాలు చూపించి, ఆ తర్వాతే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వ్యాపారుల ఆస్తులను కూల్చివేయడం వారి జీవనోపాధిని దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. ప్రజల సమస్యలు పట్టించుకోని స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్‌పై విమర్శలు గుప్పించారు. ప్రజల ఆవేదనను విస్మరించిన ఆయనను రాబోయే ఎన్నికల్లో ప్రజలే గుణపాఠం చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు శ్రవణ్‌కుమార్, కలాలి కృష్ణ, మాజీ కౌన్సిలర్ సత్తయ్య, వ్యాపారులు కిషన్, రామన్న తదితరులు పాల్గొన్నారు.

# ఎంజాయ్ పేరుతో గంజాయి వద్దు

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**




గంజాయి, డ్రగ్స్ వంటి వ్యసనాలు యువత భవిష్యత్తును చీకటిలోకి నెట్టుతున్నాయని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ, తెలంగాణ ప్రజా నాట్య మండలి సంయుక్త ఆధ్వర్యంలో మంచిర్యాల బస్టాండ్ వద్ద "ఎంజా య్ పేరుతో గంజాయ్ వద్దు" అనే నినాదంతో బస్సు కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామడుగు లక్ష్మణ్ మాట్లాడు తూ.. డ్రగ్స్ మనిషి శరీరం, మెదడు, మనసును క్రమంగా దెబ్బతీస్తాయని తెలిపారు. ఒకసారి అలవాటు పడితే బయటపడటం చాలా కష్టమని చెప్పారు. డ్రగ్స్, గంజాయి వంటి వ్యసనాలు ఆర్థికంగా, సామాజికంగా కుటుంబాలను దెబ్బ తీస్తాయని పేర్కొన్నారు. ఈ వ్యసనాలు ఇప్పుడు గ్రామాలకూ విస్తరిస్తున్నందున, వాటి నిర్మూలనకు విస్తృత ప్రచారం అవసరమని సూచించారు. ఈ కార్యక్రమంలో 'మనిషి విలువలు, డ్రగ్స్ భారిన విద్యార్థులు' అనే వీధినాటకాన్ని ప్రజా నాట్య మండలి కళాకారులు ప్రదర్శించారు. డ్రగ్స్‌పై పలు గేయాలు ఆలపించి విద్యార్థుల్లో చైతన్యం నింపారు. తెలంగాణ ప్రజా నాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి వ్యసనాలపై రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కల్పించేందుకు బస్సు జాతను నిర్వహిస్తున్నామని తెలిపారు. మండలి ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ పేర్కొన్నారు డ్రగ్స్ నిర్మూలన లక్ష్యంగా ఈ యాత్ర కొనసాగుతుందని. ఈ కార్యక్రమంలో మేకల దాసు, కలిందర్ అలీ ఖాన్, రేగుంట చంద్రశేఖర్, లింగం రవి, మిట్టపల్లి శ్రీనివాస్, మిరియాల రాజేశ్వర్ రావు, దాగం మల్లేష్, పూజారి రామన్న, కె.లక్ష్మీనారాయణ, కె.ఉప్పలయ్య, ఎ.రవి, కళాకారులు రాము, సైదులు, విజయ్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాల పునరుద్ధరణకు కృషి



**శెనార్తి మీడియా, బోథ్:** బోథ్ నియోజకవర్గ కేంద్రం నుంచి తరలిపోయిన ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలను తిరిగి తీసుకురావడం తన బాధ్యతగా భావిస్తున్నానని బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భోడ్డు గంగారెడ్డి తెలిపారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పంచాయతీరాజ్ సబ్‌డివిజన్ కార్యాలయం, గృహ నిర్మాణ సంస్థ కార్యాలయం ప్రస్తుతం నమూనా ఇందిరమ్మ ఇంటిలో కొనసాగుతున్నాయని చెప్పారు. ఉపకోశాధికారి (STO) కార్యాలయానికి త్వరలోనే నిధులు మంజూరు అయ్యే అవకాశం ఉందని, ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయానికి అద్దె భవనం వెతికే ప్రక్రియలో ఉన్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని ప్రభుత్వం బోథ్‌ను ఇంటిగ్రేటెడ్ రెవెన్యూ డివిజన్‌గా అభివృద్ధి చేసే దిశగా ముందుకు వెళ్తుందని గంగారెడ్డి తెలిపారు. దీనికి సహకరిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ అడే గజేందర్, మాజీ పార్లమెంట్ సభ్యుడు సోయం బాబూరావు, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, పిఎసిఎస్ డైరెక్టర్ చట్ల ఉమేష్, యువ నాయకులు అలపాటి అచ్యుతానంద రెడ్డి పాల్గొన్నారు.

## బోథ్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి



**శెనార్తి మీడియా, బోథ్:** బోథ్ మండల కేంద్రంలో తక్షణమే ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరుతూ బోథ్ గ్రామాభివృద్ధి కమిటీ (వీడీసీ) సభ్యులు హైదరాబాద్‌లో ప్రభుత్వ సలహాదారు నరేందర్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. బోథ్, పరిసర ప్రాంతాల విద్యార్థులు ఉన్నత విద్య కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లవలసి వస్తోందని, ఇది ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల విద్యార్థులకు, ముఖ్యంగా బాలికలకు తీవ్ర ఇబ్బందిగా మారిందని వారు తెలిపారు. డిగ్రీ కళాశాల ఏర్పాటు ద్వారా స్థానిక యువతకు ఉన్నత విద్య సులభంగా అందుబాటులోకి వస్తుందని, నిరుద్యోగ సమస్య కొంతవరకు తగ్గుతుందని కమిటీ సభ్యులు వివరించారు. బోథ్ ప్రజల అభ్యర్థనను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి డిగ్రీ కళాశాల స్థాపనకు కృషి చేస్తానని నరేందర్ రెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు అల్లకొండ పోతన్న, ప్రధాన కార్యదర్శి సాయినాథ్ గౌడ్, కోశాధికారి రమాకాంత్, నాయకులు గొర్ల రాజు యాదవ్, నరసింహదాస్ పాల్గొన్నారు.

## ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకలు

**శెనార్తి మీడియా, బోథ్:** ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని బోథ్ పట్టణ కేంద్రంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కె. గోదావరి జెండా ఆవిష్కరణ చేశారు. జిల్లా అధ్యక్షుడు బి. గోవర్ధన్ మాట్లాడుతూ కనీస వేతనం రూ.26,000గా నిర్ణయించాలనీ, రద్దు చేసిన 4 లేబర్ కోడ్లను నిలిపివేసి 44 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కె. గోదావరి, దాస్, భోజన్న, గౌరక్క, భాగీరథ, మల్లు బాయ్, సత్తమ్మ, సత్యభామ, వసంత, మున్సిప్ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

## తేమ శాతం లేకుండా తడిసిన పంటలను కొనుగోలు చేయాలి

- రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న



**శెనార్తి మీడియా, బోథ్:** బోథ్ మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్‌లో గత వారం రోజులుగా వర్షాల కారణంగా తడిసిన పంటలను తేమ శాతం పరిగణలోకి తీసుకోకుండా కొనుగోలు చేయాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న డిమాండ్ చేశారు. నాఫెడ్, మార్కుఫెడ్ ఆధ్వర్యంలోని ప్యాక్స్ ద్వారా రైతులు పండించిన పత్తి, సోయాబిన్, మొక్కజొన్న పంటలను తక్షణమే కొనుగోలు చేయాలని ఆయన కోరారు. గత రెండు నెలలుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల 30 వేల ఎకరాల పంటలు నష్టపోయాయని, వ్యవసాయ శాఖ నివేదిక ప్రకారం రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున పంట నష్టపరిహారం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినా, ఇప్పటికీ ఒక్కరికి కూడా పరిహారం అందలేదని తెలిపారు. రైతులు భారీ పెట్టుబడులతో సాగు చేసిన పంటలకు దిగుబడి లేకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బొర్రన్న ఆవేదన వ్యక్తం చేశారు. మొక్కజొన్న మద్దతు ధర రూ.2400 ఉండగా, ప్రైవేట్ వ్యాపారులు క్వింటాల్‌కు రూ.1850 మాత్రమే చెల్లిస్తున్నారని, సోయాబిన్ మద్దతు ధర రూ.5328 ఉన్నా, మార్కెట్‌లో రూ.4100కే కొనుగోలు చేస్తున్నారని విమర్శించారు. రైతుల పంటలకు సరైన మద్దతు ధర కల్పించి, తడిసిన పంటలను తక్షణమే ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు రవీందర్ రెడ్డి, అర్క అవినాష్, కే. రాజన్న, సత్యపాల్, డి. శంకర్, దత్తు తదితరులు పాల్గొన్నారు.